జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 3 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 6



# కొత్తగూడెం బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు



## కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనం-మాజీ మంత్రి వనమా

**పాల్వంచ(టౌన్), డిసెంబర్ 2 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం పర్యటన నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులపై జరుగుతున్న ముందస్తు అరెస్టులను మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు.ఆరు గ్యారంటీల అమలు కోసం ఎక్కడ ప్రశ్నిస్తారో అన్న భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న ఈ తీరు అప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా వనమా వ్యాఖ్యానించారు. "తమ హక్కుల కోసం,ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుంది.ప్రశ్నించే వారిపై కక్షతో కేసులు పెట్టి అరెస్ట్ చేయడం ప్రజాపాలన కాదు,నిరంకుశ నిర్బందపు పాలన," అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ 'నిర్బంధపు రాక్షస పాలన'కు ప్రజలు త్వరలోనే ముగింపు పలికే రోజు వస్తుందని వనమా హెచ్చరించారు. గృహనిర్బంధం చేసిన,అరెస్ట్ చేసిన బిఆర్ఎస్ నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

- ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుదల.. సీఎం రేవంత్ రెడ్డి
- పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్ఫూర్తితో పని చేస్తున్నాం
- సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- ఉమ్మడి జిల్లాలో మంత్రులు బట్టి, తుమ్మల, పొంగిలేటి అనుకుంటే జరగనిది లేదు
- ఈ ముగ్గురు మంత్రులు అడిగిన వాటికి నిధులు మంజూరు చేసే బాధ్యత నాది
- డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి



# దేశానికే అగ్రగామిగా

# డాక్టర్ మన్మోహన్ సింగ్ సైన్స్ ఎర్త్ యూనివర్సిటీ

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు

మిగతా 2 లో...

# కీలక ఖనిజ స్వయం సమృద్ధిలో గొప్ప ముందడుగు



- సింగరేణిలో బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి కీలక ఖనిజాల వెలికితీత
- సీఎస్ఐఆర్-ఐఎంఎంటీతో సింగరేణి సంయుక్త అన్వేషణ
- సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో కీలక ఒప్పందం

**కొత్తగూడెం సింగరేణి, డిసెంబరు 2 – ప్రజాజ్యోతి:** సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి వాటిని వెలికి తీసేందుకు ప్రముఖ పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్ – ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్ – ఐఎంఎంటీ) తో సంయుక్త భాగస్వామ్యంలో పని చేసేందుకు సింగరేణి కాలరీస్ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో నిక్షిప్తమై ఉన్న కీలక ఖనిజాలను వెలికితీయనున్నారు. మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించేందుకు అనుగుణంగా ఇరుపక్షాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కీలక ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఈ ఏడాది జూన్ లో తొలుత ఒక అవగాహన కుదుర్చుకున్నామని, తాజా ఒప్పందంతో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బలమైన ముందడుగు పడిందని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతంలోని ఓపెన్ కాస్టు గనుల్లో, ఎస్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్, బాటమ్ యాష్లో, ఇక్కడి గుట్టల్లో కీలక ఖనిజాల ఉనికిని ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో కొన్నింటిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించబడిందని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా విడుదల అయ్యే ఫ్లై యాష్ లో

మిగతా 2 లో...

## కీలక ఖనిజ స్వయం సమృద్ధిలో గొప్ప ముందుడుగు

(మొదటి పేజీ తరువాయి...)

కూడా వీటిని కనుగొనడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే మణుగూరుకు సమీపంలోని దుర్గం గుట్ట బ్లాకులో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు శాంపిల్స్ ద్వారా నిర్ధారించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో 14 రకాల ఖనిజాల ఉనికి కనుగొనబడిందని, వీటిలో లాంథనం, సీరియమ్, ప్రసియోడీమియం వంటి 6 రకాల లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, అలాగే ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి 8 రకాల హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని కనుగొన్నామని, వీటిపై ఇంకా సంపూర్ణ పరిశీలన, విశ్లేషణ, లాభదాయకత శాతాన్ని బట్టి ఉత్పత్తి ప్రక్రియ వంటి అంశాలను ఐఎంఎంటి సంస్థ ద్వారా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వ్యర్థాల నుండి క్రిటికల్ మినరల్స్ వెలికితీత, స్వదేశీ సాంకేతిక పద్ధతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. భారతదేశంలో గ్రీన్ టెక్నాలజీ కి అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, క్రిటికల్ మినరల్స్ భద్రత దిశగా ఇది గొప్ప ముందడుగు అన్నారు. ఇది లాభదాయకంగా ఖనిజాల వెలికితీత అవకాశాలకు బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలపై సి ఎస్ ఐ ఆర్ – ఐఎంఎంటి చీఫ్ సైంటిస్ట్ మరియు హైడ్రో అండ్ ఎలక్ట్రో మెటలర్జీ శాఖ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్, సింగరేణి సంస్థ నుండి కార్యక్రమంలో డైరెక్టర్(పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు సంతకాలు చేశారు. ఈడీ ఎస్టీపీపీ చిరంజీవి, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ బి.శ్రీనివాస్, జీఎం చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ప్రాణం తీసిన మొక్కజొన్న కంకి



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** రహదారిపై ప్రయాణం చేసే వారికి మృత్యు రూపం ఎటు నుంచి వస్తుందో తెలియదు కానీ తలరాత ఎలా ఉంటే అలా జరుగుతుందేమో అని అనుకోవడానికి ఈ సంఘటన నిదర్శనంగా ఉన్న ఒక యువకుడిని మొక్కజొన్న కంకి మృత్యు రూపంలో వచ్చి యువకుడి ప్రాణం తీసిన సంఘటన మంగళవారం పాల్వంచ మండలంలో జరిగింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, భద్రాచలం వైపు వెళ్తున్న ఒక కారు పాల్వంచ మండలం జగన్నాధపురం దాటిన తర్వాత మొక్కజొన్న కంకి కొనుక్కునేందుకు కారు రోడ్డుపై నిలిపిన తర్వాత వెనుక వచ్చే బైక్ చూడకుండా డ్రైవర్ ఒక్కసారిగా డోర్ తీయడంతో సడన్గా డోరు తీయడం వలన బైకు బలంగా ఢీ కొట్టింది దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి దీంతో స్థానికులు సహాయంతో యువకుడిని చికిత్స నిమిత్తం స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు, ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, కాగా రూరల్ పోలీసులు మొక్కజొన్న కంకుల దుకాణాలు రోడ్డు పక్కన ఉంచరాదని కోరారు

# దేశానికే అగ్రగామిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ సైన్స్ ఎర్త్ యూనివర్సిటీ









(మొదటి పేజీ తరువాయి...)

పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతం అందించిందని అన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు నేడు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు. బాక్రా నంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ,ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాల నే లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు లు అడిగిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు, ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించినందుకు ప్రజల తరపున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# నామినేషన్ లోనే మోసం చేసేవారు నిజాయితీగా ప్రజా సేవ చేస్తారా...?

- నిస్వార్థ ప్రజా సేవకులను అభ్యర్థులుగా నిలబెట్టాం

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజా జ్యోతి)**ఎన్నికలలో పోటీ చేసేందుకు సమర్పించే నామినేషన్ ప్రక్రియలోనే తప్పుడు సమాచారం ఇస్తూ మోసపూరితంగా పోటీలో నిలవాలని చూసే అభ్యర్థులు నిజాయితీగా ప్రజా సేవ చేస్తారంటే నమ్మేందుకు భద్రాచలం పట్టణ ప్రజలు అంత అమాయకులు కారని నిజాయితీగా నిలబడే అభ్యర్థులని గెలిపించి చూపిస్తారని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అన్నమయ్య హోటల్ వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి టిఆర్ఎస్ కన్వీనర్ సునీల్ అధ్యక్షతన జరిగిన సిపిఎం బిఆర్ఎస్ జిడిపి కూటమి ఉమ్మడి సమావేశంలో బండారు రవికుమార్ మాట్లాడారు. ప్రజా పోరాటాల కేంద్రమైన భద్రాచలంలో ఎన్నికల కోసం మతోన్మాద శక్తులతో జతకట్టే రాజకీయ పార్టీలు వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని పునరా ఆలోచన చేసుకోవాలని బండారు రవికుమార్ కోరారు. పదవుల కోసం అపవిత్ర పొత్తులు పెట్టుకొని ప్రజలను మోసం చేయాలని చూస్తే ఈ ప్రాంత ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా పోరాటాలకు సంస్కృతి సంప్రదాయాలకు కేంద్రమైన భద్రాచలంలో మతోన్మాద శక్తులకు చోటు లేదని బండారు రవికుమార్ అన్నారు.రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల కాలంలో ఖనిజ సంపదను దోచుకోవడం తప్ప ఈ ప్రాంత ప్రజలకు చేసింది ఏమీ లేదని రవికుమార్ ఆరోపించారు. ప్రశ్నించే వారిని పంచాయతీ పాలకవర్గంలోకి పంపిస్తే భద్రాచల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన అన్నారు.





**నిస్వార్థ ప్రజా సేవకులను అభ్యర్థులుగా నిలబెట్టాం**

**బిఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్**

డిసెంబర్ 11వ తారీఖున జరిగే భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికలలో నిస్వార్థంగా ప్రజాసేవ చేసే అభ్యర్థులని బిఆర్ఎస్ సిపిఎం జిడిపి కూటమి పోటీలో నిలిపిందని ప్రజలు ఆశీర్వదిస్తే భద్రాచలం గ్రామపంచాయతీని అన్ని రూపాలలో అభివృద్ధి చేసి చూపిస్తామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. నామినేషన్ ప్రక్రియలో తప్పుడు సమాచారంతో పోటీ చేసే అర్హత కోల్పోయిన అభ్యర్థులు వాటిని బయటపెట్టిన బిఆర్ఎస్ సిపిఎం జిడిపి నాయకుల పై అవాకులు చావాకులు పేలటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో భద్రాచలానికి ఒరిగిందేమీ లేదని ఎక్కడ చూసినా దందాలు చందాలు తప్ప ఆ పార్టీ భద్రాచలం ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని రావులపల్లి రాంప్రసాద్ స్పష్టం చేశారు. 11 వ తారీకు తర్వాత భద్రాచలం గ్రామపంచాయతీ లో కూటమి పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తుందని ఐదేళ్లపాటు అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని రామ్ ప్రసాద్ హామీ ఇచ్చారు. పట్టణంలోని కూటమి బలపరుస్తున్న 20 వార్డులలో అభ్యర్థులను అదేవిధంగా సర్పంచ్ గా మానే రామకృష్ణను గెలిపించి భద్రాద్రి అభివృద్ధికి నాంది పలకాలని కోరారు.

**ప్రజలు ఆశీర్వదిస్తే నిస్వార్థ ప్రజా పాలన అందిస్తా**

**సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ**

10 సంవత్సరాల తర్వాత భద్రాచలం గ్రామ పంచాయతీకి జరిగే ఎన్నికలలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఆశీర్వదిస్తే ఐదేళ్లపాటు నిస్వార్థ ప్రజా సేవ చేస్తూ అభివృద్ధి చేస్తానని సిపిఎం బిఆర్ఎస్ జిడిపి పార్టీల కూటమి సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ అన్నారు. ప్రజాసేవ కోసమే ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలేసి రాజకీయాల్లోకి వచ్చానని పదవి ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ఈ ప్రాంత ప్రజలకు శక్తి వంచన లేకుండా సేవలు అందించానని ఆయన అన్నారు. పోటీ చేసే అభ్యర్థుల చరిత్రలు ఏమిటో ఒకసారి అధ్యయనం చేసి ఓటు వేయాలని ప్రజల్ని కోరారు. భద్రాచలం పట్టణాన్ని ముంపునుండి కాపాడుకునేందుకు కరకట్ట పునర్నిర్మానం కోసం కృషి చేస్తానని పట్టణంలోని ప్రతి నివాస ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ నిధులను పారిదర్శకంగా వినియోగిస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 11వ తారీఖున జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ సిపిఎం జిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించి సుందర భద్రాద్రిగా తీర్చిదిద్దే అవకాశాన్ని కల్పించాలని మాని రామకృష్ణ ప్రజలను కోరారు

**భద్రాద్రి సంక్షేమం కోసమే కూటమి ఏర్పాటు**

అవినీతి కాంగ్రెస్ పాలన నుండి భద్రాచలానికి విముక్తి కలిగించేందుకే బీఆర్ఎస్ సిపిఎం జిడిపి పార్టీలు కూటమిగా ఏర్పడి గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్నాయని జిడిపి పార్టీ కన్వీనర్ గుండి శరత్ బాబు అన్నారు. గడిచిన రెండేళ్లలో భద్రాచలం పట్టణంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. సామాన్యులు ఇల్లు నిర్మించుకుందామంటే కనీసం ఇసుక కూడా దొరకకుండా చేస్తున్నారని శరత్ బాబు ఆరోపించారు. కూటమి బలపరిచిన అభ్యర్థులతోనే భద్రాచల సమగ్ర అభివృద్ధి సాధ్యమని శరత్ బాబు స్పష్టం చేశారు. ఏ ఒక్క అవినీతి మరకలేని నిజాయితీ గల అభ్యర్థులని ప్రజల ముందు నిలబెట్టామని వారిని ఆశీర్వదించి గెలిపించాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగ, బిఆర్ఎస్ నాయకులు కోటగిరి ప్రమోద్ కుమార్, తుమ్మల పల్లి ధనేశ్వరరావు, రేపాక పూర్ణచంద్ర రావు, ఉడత రమేష్,సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, సంతోష్ కుమార్, డి సీత, లక్ష్మి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేత పొనిశెట్టి వెంకటేశ్వర్లు ముందస్తు అరెస్ట్ పై తీవ్ర విమర్శలు



**పాల్వంచ(టౌన్), డిసెంబర్ 02 (ప్రజా జ్యోతి) :**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో ఉన్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులపై ముందస్తు అరెస్టులు కొనసాగుతున్నాయి.అదే పరిణామంలో,మంగళవారం ఉదయం పాల్వంచ పోలీసు అధికారులు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీ పొనిశెట్టి వెంకటేశ్వర్లును ముందస్తుగా అరెస్ట్ చేశారు.అరెస్ట్ అనంతరం మాట్లాడిన పొనిశెట్టి వెంకటేశ్వర్లు ప్రభుత్వం చర్యలను తీవ్రంగా ఖండిస్తూ,“ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తిరుగుతూ,ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుర్వినియోగానికి ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని అణచివేయడానికి జరుగుతున్న ఈ చర్యలను ప్రజలు ఖండించాలి” అన్నారు.పలువురు బీజేపీ కార్యకర్తలు ఈ అరెస్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు హేయమైన చర్య

- మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం.



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 2(ప్రజా జ్యోతి):**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం వస్తున్న సందర్భంలో పాల్వంచ మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పూసల విశ్వనాథంను మంగళవారం తెల్లవారుజామున పాండురంగాపురం గ్రామంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు.ఈ సందర్భంగా పూసల విశ్వనాథం మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీలను అమలు చేయకుండా బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తు గిరిజన విద్యార్థి నాయకుల అరెస్ట్



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 2(ప్రజా జ్యోతి):**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా పర్యటనకు ముందుగానే గిరిజన విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గిరిజన విద్యార్థి సంఘం భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ అనిల్ నాయక్,యల్ హెపిఎస్ మండల అధ్యక్షులు ఇస్లావత్ రాంబాబు నాయక్‌లను పాల్వంచ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన తెలిపే హక్కును పోలీసులు హరించేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.“ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు. ప్రజాస్వామ్యంలో అహింసా మార్గంలో నిరసన తెలిపే పరిస్థితి కూడా లేకుండా చేస్తున్న పోలీస్ జూలూం నశించాలి.ఇలా చేస్తే ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుంది” అని వారు పేర్కొన్నారు.అదే విధంగా,కులాల మధ్య వివాదాలు రెచ్చగొడుతున్న వారిని అరెస్ట్ చేసి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.“1/70 చట్టాలు,పిఈఎస్ఏ చట్టాలను గిరిజనేతరులు విచ్చలవిడిగా ఉల్లంఘిస్తున్నారు.అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను బడానేతలు భూబదలాయింపులతో తొక్కిపెడుతున్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న ఈ చర్యలకు వ్యతిరేకంగా గిరిజన సమాజం ఉద్యమించాల్సిన అవసరం ఉంది” అని తెలిపారు.చివరగా “జై సేవాలాల్ మహారాజ్ కి జై” అంటూ నినదించారు.

## సర్పంచ్ గా గెలిపిస్తే జంగాల కాలనీని అభివృద్ధి చేసి చూపిస్తా

- ఓట్లు వేపించుకుంటున్నారు, అభివృద్ధి మరుస్తున్నారు
- మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి)** సర్పంచ్ గా ఒక అవకాశం ఇస్తే భద్రాచలం పట్టణంలోని జంగాల కాలనీ రూపురేఖలు మార్చి మోడల్ కాలనీగా మార్చే విధంగా కృషి చేస్తానని స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్ అన్నారు. అనేక సంవత్సరాలుగా చిన్న చిన్న గుడిసెలలో నివసిస్తున్న జంగాల ప్రజల పట్ల నాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఆ కాలనీ అభివృద్ధి సాధ్యం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చి అనేక హామీలు ఇచ్చిన గత పాలకులు గెలిసిన తర్వాత ఒక్కరు కూడా వారిని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వారికి ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందక చిన్నచిన్న డేరాలు వేసుకొని మగ్గిపోతున్నారని అటువంటి వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప వారికి ఎటువంటి మేలు చేయకపోవడం సరైనది కాదన్నారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించినట్లయితే ఆ కాలనీ ప్రజలకు పక్కా ఇండ్లు, డ్రైనేజీలు, రోడ్లు ఇతర సదుపాయాల ఏర్పాటుచేసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు, అద్భుతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు




**ఇల్లెందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటారనే నేపంతో మంగళవారం ఇల్లందు భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ విధంగా పర్యటిస్తారని, ఇది పూర్తిగా ఎన్నికల నియమావళికి విరుద్ధమని తక్షణమే ఎన్నికల కమిషన్ స్పందించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మాజీ వార్డు కౌన్సిలర్ జెకె శ్రీనివాస్, నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, గిన్నారపు రాజేష్, సత్తాల హరి కృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, చాంద్ పాష, రవి కాంత్, వార రమేష్, మీర్జా బేగ్ తదితరులు ఉన్నారు.

## జెకె5 ఓసిలో కార్మికుడి మృతి

- గుండెపోటుతో విధుల్లోనే మృతి
- నివాళులర్పించిన కార్మిక సంఘాల నేతలు





**ఇల్లెందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా జెకె5 ఓసిలో విధులు నిర్వహిస్తుండగానే గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే సింగరేణి జెకె5 ఓసి లో జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తున్న పాల్వాయి శ్రీనివాసులు (59) మంగళవారం డ్యూటీకి వెళ్లడం జరిగింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోవడంతో తోటి కార్మికులు పుటాహుటిన సింగరేణి వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు శ్రీనివాసులు మరణించినట్లుగా తెలిపారు. శ్రీనివాసులుకు గుండె నొప్పి రావడంతో 2011లో స్టంట్ వేయడం జరిగింది. మెడికల్ బోర్డు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలుస్తుంది. కాగా శ్రీనివాసులు గతంలో అండర్ గ్రౌండ్ ఫిట్టర్ గా కొనసాగుతుండగా, ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో జనరల్ మజ్దూర్ గా ప్రస్తుతం పని చేస్తున్నాడు. శ్రీనివాసులు మృతి పట్ల గుర్తింపు సంఘం నాయకులు సారయ్య, నజీర్ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, ప్రాతినిధ్య సంఘ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, నాయకులు కొండూరి చిన్న, బండి రాము, బాబురావు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ లు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేసి, మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## డిసెంబర్ నెలాఖరులో నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు

- త్వరలో షెడ్యూల్ విడుదల

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి)** భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నెహ్రూ కప్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు డిసెంబర్ నెల చివరి వారంలో ప్రారంభించి జనవరి మొదటి వారం వరకు నిర్వహించనున్నట్లు నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, వాతాడి దుర్గా అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 1994 నుంచి ఈ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయని ఈసారి 30వ సారి కూడా క్రికెట్ పోటీలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూలు త్వరలో వెల్లడిస్తామని వారు వెల్లడించారు. ఈ టోర్నమెంట్ కు సంబంధించి ఇంకా ఏమైనా వివరాలు కావాలంటే ఎస్.కె.సలీం, నెహ్రూ కప్ కన్వీనర్ 9440101108లో సంప్రదించాలని వారు కోరారు.

## నామినేషన్ ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు బి. సర్వేశ్వర్ రెడ్డి





**అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో డిసెంబర్ 14న జరగబోయే పంచాయతీ ఎన్నికల రెండో విడతకు సంబంధించి నడుస్తున్న నామినేషన్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు బి. సర్వేశ్వర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన అన్నపురెడ్డిపల్లి, నర్సాపురం, పెద్దిరెడ్డిగూడెం నామినేషన్ కేంద్రాలను సందర్శించి నామినేషన్ స్వీకరణ విధానం, అధికారులు చేసిన ఏర్పాట్లు, కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను సమీక్షించారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నియమ నిబంధనలకు లోబడి కొనసాగాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# విద్యార్థులకు పక్కాగా మెనూ అమలు చేయాలి





**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** హాస్టల్ లలో విద్యార్థులకు పక్కాగా మెనూ అమలు చేయాలని డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్) అశోక్ అన్నారు. మంగళవారం ఏటిడిఓ ఇల్లందు ఆఫీస్ లో ఇల్లందు పరిధిలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్, ఎస్సీ ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్య, సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. పాఠశాలలకు వచ్చే నిధులను, సంక్షేమ పథకాలను ఖచ్చితంగా విద్యార్థులకు అందేలా చూడాలని, 10వ తరగతి విద్యార్థులను పక్కా ప్రణాళికతో పరీక్షకు సన్నద్ధం చేయించి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని తెలిపారు. ఉద్దీపకం అమలుపై కాంప్లెక్స్ హెచ్ఎం, ఎస్సిఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల సంక్షేమం, శుభ్రత, నిధుల వినియోగ విషయంలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇల్లందు ఏటిడిఓ యు. భారతీదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎస్సిఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ 69వ వర్ధంతి కరపత్రాల విడుదల



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి)** భారతదేశ ముద్దుబిడ్డ నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 69వ వర్ధంతి కరపత్రాన్ని భద్రాచలం ప్రముఖ విద్యాసంస్థల అధినేత , డాక్టర్ కాంతారావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామల సత్యం మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్రాజ్, తెలంగాణ సోషలిస్టు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బుయ్యన వీర బాబు, పాల్గొని తన సేవలను గుర్తించి డాక్టర్ గారికి శాలువాతో సన్మానం చేశారు, వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే అంబేద్కర్ ఆశయాల సాధన కోసం నిరంతరం కూలీ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళుతూ నవ సమాజం రాజ్యాధికారం బహుజనులు అంతిమ లక్ష్యమని వారు తెలియజేశారు.

## నాగారం మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరిక



**పాల్వంచ(టౌన్),డిసెంబర్02(ప్రజా జ్యోతి):** పాల్వంచ మండలం నాగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు బానోతు రాజా,బానోతు మంగమ్మ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం నాగారంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్వాల శ్రీనివాసరావు, "గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బలహీన వర్గాల ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయి.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం అందరూ కృషి చేయాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పీటీసీ ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న,సొసైటీ మాజీ డైరెక్టర్ చౌగాని పాపారావు,నాయకులు వీసంశెట్టి శ్రీనివాసరావు,ముత్యాల మంగయ్య, జలగం హనుమంతయ్య,జలగం బాబురావు,మెంటం రాము,జలగం ఈశ్వరయ్య,సుధాకర్,చౌగాని నాగేశ్వరరావు,బానోతు వినయ్, బానోతు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి)** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఉన్న దాసాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారంను పురస్కరించుకొని స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారిని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

## కొత్తగూడెం సీఎం సభకు హాజరైన ఇబ్రహీమ్



**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ శంకుస్థాపనకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శి యండి. ఇబ్రహీమ్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఎర్త్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం పర్యటన విజయవంతం

- సీఎం షెడ్యూల్ రెండు గంటలకు రావాల్సి ఉండగా సాయంత్రం 4: 59 నిమిషాలకు సభా వేదిక వద్దకు చేరుకున్న సీఎం
- సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యంగా రావడంతో వెనుదిరిగిన వేలాది మంది ప్రజలు
- విద్యార్థులతో నిండుగా కనిపించిన సభా వేదిక
- ఢిల్లీ టూర్ లో భాగంగా ఆలస్యంగా రావడం జరిగిందని సభలో ప్రజలకు వివరించిన సీఎం
- గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించిన సీఎం _ మంత్రులు
- రానున్న సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- సీఎం పర్యటన విజయవంతం కాడముతో ఊపిరి పీల్చుకున్న పోలీస్, రెవెన్యూ యంత్రాంగం

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 2, ప్రజా జ్యోతి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోట్ల రూపాయలతో చేపట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్ సైన్స్ యూనివర్సిటీ నీ మంగళవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రుల తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు, సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు కావడంతో గత పది రోజుల నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ,అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఇతర రెవెన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు, సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రెండు గంటలకు ప్రారంభించేందుకు రావాల్సి ఉండగా సీఎం ఢిల్లీ టూర్ లో భాగంగా సాయంత్రం4:59 నిమిషాలకు సభ వేదిక వద్దకు రావడం జరిగింది, సుమారు మూడు గంటల పాటు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి ఆలస్యంగా రావడంతో ఉదయం నుండి ప్రజలు యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకోగా సీఎం రావడం ఆలస్యం కావడంతో సుమారు 2000 మంది ప్రజలు వెనుతిరగడం కనిపించింది, అయినప్పటికీ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి చేరుకున్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉండడంతో సభ వేదిక నిండుగా కనిపించింది, యూనివర్సిటీ కి చేరుకున్న విద్యార్థిని విద్యార్థులకు ,పార్టీ కార్యకర్తలకు అన్ని వర్గాల ప్రజలకు జిల్లా కలెక్టర్ అన్ని వసతులు ఏర్పాటు చేయడంతో ప్రాంగణంలో ఉన్న ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాలేదు, ప్రజలకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రజలకు అన్ని వసతులు సమకూర్చడంతో సంతృప్తి వ్యక్తం చేశారు, అదేవిధంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో సీఎం పర్యటనలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా 9 వందల మంది పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు, మొత్తానికి సీఎం పర్యటన విజయవంతం కావడంతో పోలీస్, మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు, కాగా యూనివర్సిటీ ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి వచ్చే వరకు కళాజాత బృందం నిర్వహించిన కళ నృత్యాలు, జానపద గేయాలు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల పై ఆలపించిన గేయాలు పలువురుని ఆకట్టుకున్నాయి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో ఫైర్ సిబ్బంది, అత్యవసరంగా వైద్య సదుపాయాలు నీటి వసతి భోజన వసతి అన్ని సౌకర్యాలను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు ,అదేవిధంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంకల్పించిన ఆర్గాన్ ఫుడ్ స్టాల్స్ ను వేదిక వద్దకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు,










## ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కలిశారు. పోడు రైతుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, కొమరారం, బోడు మండలాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎంతో చరిత్ర కలిగిన ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా మార్చాలని, గోదావరి జలాలు సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇల్లందు నియోజకవర్గంతో పాటు మహబూబాబాద్ నియోజకవర్గాలకు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం పెద్ద ఒక విషయాన్ని త్వరితగతిన పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చెప్పినట్లు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు.

## యన్. యమ్.డీ. సీ పాల్వంచ యూనిట్ ను పునరుద్దరించండి

- -రెవిన్యూ శాఖ మంత్రికి వినతిపత్రం అందచేసిన ఐ. యన్. టీ. యూ. సీ నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 2, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో మూతబడిన పడిన పరిశ్రమను పునరుద్ధరించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి ఐ. యన్. టీ. యూ. సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలీల్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు బానోత్ బాలు నాయక్ లు వినతిపత్రం అందచేసారు. మంగళవారం పాల్వంచలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్శిటి ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లకు వినతి పత్రం అందజేశారు , ఇందుకు స్పందించిన మంత్రి త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని జలీల్, బాలు నాయక్ లు విలేకరులకు తెలిపారు ,ఈ కార్యక్రమం లో నాయకులు రవి నాయక్, సక్రం నాయక్ లు పాల్గొన్నారు.

## నామినేషన్ల చివరి రోజు–సౌకర్యాలు సమకూర్చాలి-జడ్పీ సీఈఓ నాగలక్ష్మి.

- జాగన్నాధపురం,కేశవాపురం-నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన అధికారులు.



**పాల్వంచ(టౌన్), డిసెంబర్ 2 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల చివరి రోజు కావడంతో ఎక్కువ మంది అభ్యర్థులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు,వ్యవస్థలు సిద్ధంగా ఉంచాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ( జడ్పీ – సి ఈ ఓ ) నాగలక్ష్మి సూచించారు.మంగళవారం జాగన్నాధపురం, కేశవాపురం,బసవతారక కాలనీ గ్రామపంచాయతీలలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను ఆమె స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులకు కీలక సూచనలు చేస్తూ.నిబంధనలను కచ్చితంగా పాటించాలని,అభ్యర్థులు సమర్పించే ప్రతి నామినేషన్‌ను రిజిస్టర్లో నమోదు చేయాలని,అభ్యర్థితోపాటు ఇద్దరినే లోపలికి అనుమతించాలని ఆదేశాలు జారీ చేశారు.నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత,శాంతియుత వాతావరణం తప్పనిసరిగా ఉండాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి,ఎంపీఓ చెన్నకేశవులు,ఏపీవో పోరండ్ల రంగా, గ్రామపంచాయతీ కార్యదర్శులు రవి, మౌనిక,రాంబాబు,వంశీకృష్ణ,జ్యోతి పాల్గొన్నారు.

## కిన్నెరసాని అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చు భగ్నం.

- అప్రమత్తమైన అటవీ సిబ్బంది – నలుగురు అదుపులో, ఒకరు పరారీ.

**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 02(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచ మండలం,కిన్నెరసాని అటవీ ప్రాంతంలో మూగజీవాల ప్రాణాలకు ముప్పుగా వేటగాళ్లు అమర్చిన కరెంట్ తీగలను అటవీ శాఖ సిబ్బంది ముందుగానే గుర్తించి పెద్ద ప్రమాదాన్ని నివారించారు. ఫారెస్ట్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం,కిన్నెరసాని జింకల పార్కు సమీపంలో జింకలను వేటాడేందుకు కరెంట్ తీగలను అమర్చారనే సమాచారం అందడంతో అటవీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో ఐదుగురు వేటగాళ్లు కరెంట్ తీగలను మర్రుతున్నట్టుగా గుర్తించారు. అటవీ సిబ్బంది వెంటనే స్పందించి నలుగురిని అదుపులోకి తీసుకోగా, ఒకరు అక్కడి నుంచి పారిపోయినట్టు తెలిపారు.ముందస్తు సమాచారం అందడంతో మూగజీవులకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఫారెస్ట్ అధికారులు స్పష్టం చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో కిన్నెరసాని బీట్ ఆఫీసర్ నగేష్,డియర్ పార్క్ వాచ్మెన్లు కళ్యాణ్, ఇబ్రహీం, యాకయ్యతో పాటు జీప్ డ్రైవర్ అన్వర్ పాషా పాల్గొనారు.



# నిర్బంధాలతో పాలన సాగించలేరు

- ♦ - అక్రమ అరెస్టులు పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టండి
- ♦ - ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయండి: కాపు సీతాలక్ష్మి



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 2 – ప్రజాజ్యోతి:** అక్రమ అరెస్టులతో పాలన సాగించలేరని, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కొత్తగూడెం పర్యటన నేపథ్యంలో టూ టౌన్ పోలీసులు కాపు సీతాలక్ష్మిని హౌస్ అరెస్ట్ చేశారు. ఆమె స్పందిస్తూ.. ప్రజా పాలన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాల పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా, ప్రశ్నించే వారిని అరెస్టు చేయడంపై దృష్టి పెడుతున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ సీఎం కొత్తగూడెంలో పర్యటిస్తున్నారని చెప్పారు. అరకొరగా ఇందిరమ్మ చీరలు ఇచ్చి ఆ చీరలనే కట్టుకొని సభకు రావాలని చెప్పడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఏరియాలో నేడు దివ్యాంగులకు ఆటల పోటీలు



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 2 – ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవము సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం ఏరియా ఆద్వర్యంలో రుద్రంపూర్ ఆర్సిఓఏ క్లబ్లో దివ్యాంగ ఉద్యోగులకు, కొత్తగూడెం ఏరియా పరిధిలోని దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించు కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా మంగళవారం న సంబంధిత అధికారులతో రేపు నిర్వహించపోయే దివ్యాంగుల ఆటల పోటీల నిర్వహణ కార్యక్రమమునకు కావలసిన పనులను పూర్తి చేయాలని అలాగే దివ్యాంగ ఉద్యోగులు మరియు కొత్తగూడెం ఏరియా పరిధిలోని దివ్యాంగ పిల్లలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలేం రాజు కోరారు.

# సోయం కృష్ణవేణికి 50 కుటుంబాల మద్దతు



**చర్ల, డిసెంబర్ 02: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం చర్ల బిఆర్ఎస్ పార్టీ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీమతి సోయం కృష్ణవేణి కి చర్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సిపిఎం పార్టీ, తెలుగుదేశం పార్టీ మద్దతు తో పాటు చర్ల మండలం లోని టాటా మేజిక్ యూనియన్ ఓనర్లు డ్రైవర్లు దాదాపు 50 కుటుంబాలు చర్ల సర్పంచ్ అభ్యర్థి సోయం కృష్ణవేణి కి మద్దతు తెలపడం జరిగింది .ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలిన లంక రాజు బ్రహ్మానందరెడ్డి అలవాల బాలు గుండెపుడి సతీష్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు నవీన్ చంటి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బర్సే దేవా లొంగుబాటుపై సమాచారం లేదు

- ♦ సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్

**చర్ల , డిసెంబర్ 02: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో మావోయిస్టు కేడర్ బర్సే దేవా (పీ ఎల్ జి ఏ బెటాలియన్ నం. 01 కమాండర్) లొంగిపోవడం పునరావాసం గురించి కొన్ని ఊహాగానాలు వచ్చాయి అని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్ మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలో అలాంటి సమాచారం లేదా పరిస్థితులు వెలుగులోకి రాలేదని స్పష్టం చేశారు. బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్రాజ్ పట్టలింగం మాట్లాడుతూ ప్రభుత్వ లొంగిపోవడం పునరావాస విధానం కింద జరుగుతున్న నిరంతర ప్రయత్నాలు బస్తర్ రేంజ్లో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. గత రెండు నెలల్లోనే కేంద్ర కమిటీ సభ్యుడు సతీష్ అలియాస్ రూపేష్, డి కె ఎస్ జెడ్ సి సభ్యులు రనిత, రాజ్మాన్ మాండ్వి, రాజు సలాం, వెంకటేష్ శ్యామ్ దాదాతో సహా 570 మందికి పైగా మావోయిస్టు కార్యకర్తలు హింస మార్గాన్ని విడిచిపెట్టి జన జీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు అని అన్నారు . బార్సే దేవా, పాపారావు , దేవ్జీ వంటి కార్యకర్తలు పరిస్థితులు వేగంగా మారుతున్నాయని అర్థం చేసుకోవాలని ఐజిపి బస్తర్ అన్నారు. హింస సంఘర్షణ మార్గంలో కొనసాగడం వల్ల వారు లేదా ఇతర కార్యకర్తలు ప్రయోజనం పొందరు అని వారు ఇప్పుడు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావడం ద్వారా గౌరవం, స్థిరత్వం కొత్త ప్రారంభాన్ని సాధించే అవకాశం ఉంది అని అందువల్ల జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలనే నిర్ణయాన్ని ఇక ఆలస్యం చేయడంలో అర్థం లేదు అని సరైన నిర్ణయం తీసుకోవడానికి ఇది అత్యంత అనుకూలమైన సమయం అని అన్నారు .

# స్థానిక పోరులో సమరానికి సై. నామినేషన్ కు ముందే నువ్వా నేనా అంటున్న పార్టీలు.

- ♦ మండలంలో అన్నిచోట్ల ముఖాముఖి.
- ♦ మండలంలో నేటి నుంచి నామినేషన్లు.

**గుండాల. ప్రజా జ్యోతి. 2.** పంచాయితీ ఎన్నికల ఘట్టం నేటి నుంచి మొదలు కానుంది అధికారికంగా నేటి నుంచి మొదలు అవుతున్నప్పటికీ నామినేషన్లు ప్రారంభానికి ముందే ఆయా పార్టీ నాయకులు ముందస్తుగానే అభ్యర్థులతో ప్రచారం నిర్వహించడం తో ముందుగానే ఎన్నికల సమరం మొదలైంది ప్రధానంగా మండలంలో కాంగ్రెస్ న్యూ డెమోక్రసీ మాస్ లైట్ తెలుగుదేశం సిపిఐ సిపిఎం పార్టీలు ఉండగా అన్నిచోట్ల ముఖాముఖి పోటీ ఉండే అవకాశం కనబడుతుంది1 నామినేషన్లు ప్రారంభానికి ముందే అభ్యర్థులు పార్టీలు ప్రచారాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్నారు మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉండగా గుండాల గ్రామపంచాయతీలో 12 వార్డుల గాను 2965 ఓటర్లు ఉండగా సాయనపల్లి పంచాయతీలో పది వార్డుల గాను 1571 ఓటర్లు ఉండగా తామరతోగు గ్రామపంచాయతీలో 8 వార్డుల గాను 541 పడుకోనిగూడెం గ్రామ పంచాయతీలో 8 వార్డుల గాను 963 ఓటర్లు ఉండగా లింగగూడెం గ్రామపంచాయతీలో 8 వార్డులకు గాను 821 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు ముత్తాపురం గ్రామపంచాయతీలో 10 వార్డులకు గాను 1588. రోల్లగడ్డ గ్రామపంచాయతీలో 8 వార్డులకు గాను 1029 ఓటర్లు ఉండగా మామ కన్ను గ్రామపంచాయతీలో 8 వార్డులకు గాను 897 ఓటర్లు ఉన్నారు కాచనపల్లి గ్రామ పంచాయతీలో 8 వార్డుల గాను 1280 ఓటర్లు ఉండగా శంభుని గూడెం గ్రామ పంచాయతీలో 8 వార్డుల గాను 965 ఓటర్లు ఉండగా శెట్టిపల్లి గ్రామపంచాయతీలో 8 వార్డుల గాను 961 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు

# కూటమి అభ్యర్థి హరిచంద్ర నాయక్ కి గ్రీన్ సిగ్నల్



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజా జ్యోతి)** భద్రాచలం గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో బీజేపీ, టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి హరిశ్చంద్ర నాయక్ నామినేషన్ రద్దుపై మూడు పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ అనూహ్య నిర్ణయంపై ఉన్నతాధికారులకు వెంటనే ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయని తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి గా పోటీ చేయవచ్చు అని ఉన్నతాధికారులు సర్పంచ్ అభ్యర్థి హరిశ్చంద్ర నాయక్ కు, బీజేపీ, టీడీపీ, జనసేన నేతలకు తెలిపారు. మూడూ పార్టీలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, హరిశ్చంద్ర నాయక్ విజయం కోసం ప్రచారాన్ని మరింత వేగవంతం చేస్తున్నాయి.

# ఉద్యమకారుల ముందస్తు అరెస్టు అన్యాయం.



**పాల్వంచ (టౌన్), డిసెంబర్02 (ప్రజాజ్యోతి ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్వంచ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మలి దశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయించుకోవడానికి, ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం ఇవ్వాలని వచ్చిన తమను ముందుగానే అరెస్ట్ చేయడం తీవ్ర అన్యాయమని సీనియర్ మలి దశ తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎస్.డి.టి.హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ, “సీఎం ఎప్పుడూ ప్రజల విజ్ఞప్తులు, ధర్నాలు, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తానని వాగ్దానం చేశారు. అలాంటి సమయంలో ఉద్యమకారులైన మమ్మల్ని అరెస్ట్ చేయడం ప్రజాపాలనకు విరుద్ధం. సమస్యలు చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా నోరు మూయించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం” అన్నారు. ఇలాంటి నిర్బంధాలు కొనసాగితే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ మలి దశ ఉద్యమకారులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి):** భద్రాచల పట్టణంలోని భవిత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా నిర్వహించిన ఆటల పోటీలు చిన్నారుల్లో అసాధారణ ఉత్సాహాన్ని నింపాయి. పాఠశాల ప్రాంగణం చిన్నారుల ఉత్సాహంతో నిండిపోయింది. భవిత టీచర్లు పద్మ, సుమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో దివ్యాంగ చిన్నారులు తమ ప్రతిభను మరింత మెరుగ్గా చాటుకున్నారు. ప్రతి ఆటలో పాల్గొన్న చిన్నారులు తమలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీసి ప్రతిభను చాటుకున్నారు. వారిలో కనిపించిన ధైర్యం, పట్టుదల, పోటీ భావన చూసి అక్కడున్నవారు అభినందనలు కురిపించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి బుధవారం జరగనున్న దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక బహుమతులను అందజేయనున్నట్లు పద్మ తెలిపారు. ఈ కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, తమ ప్రతిభను ప్రపంచానికి చూపించేందుకు మంచి వేదికగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసిస్తున్నారు.

